ఔను కదూ, నిన్న తను, పరమేశం ఆఫీసు వదలి ఎక్కడికి వెళ్లలేదు. మరయితే స్కూటర్ మీద సైకిలు స్టేండ్ స్లిప్, అతని జేబులో సినిమా టిక్కెట్లు ఎలా వచ్చినట్లు. అదే విషయం పరమేశంతో అన్నాడు.

మూర్తిగారు పరమేశాన్ని నిలదీస్తున్న తీరు, పంకజానికి ఎంతో నచ్చింది. అతను ఏం సమాధానం చెప్తాడా అని చెవులు రిక్కించి మరీ వింటోంది.

అంతవరకు ఎంతో ఇదిగా ఉన్న పరమేశానికి చటుక్కున గుర్తొచ్చింది. నిన్న తన కొలీగ్స్ రామారావు, సుబ్బారావులు, తమ బాస్ లేడని అలా సరదాగా మేట్నీకి వెళ్లొస్తామని తన స్కూటరు తీసుకెళ్లిన సంగతి. తరువాత వారు సినిమా చూసొచ్చి ఆ సినిమా టిక్కెట్లు తన స్కూటరు దగ్గరే పడేయడం, ఆ సినిమా టిక్కెట్లు వెనకాల ఏమైనా చిన్న చిన్న పద్దులు రాసుకోవచ్చనే ఉద్దేశ్యంతో అవి తన జేబులో వేసుకొన్న సంగతి.

ఇప్పుడు పరమేశానికి విషయం మెల్లిమెల్లిగా అర్థం కాసాగింది. పంకజం కోపానికి కారణం తన జేబులో దొరికిన సినిమా టిక్కెట్లు. అదే విషయం మూర్తికి చెప్పాడు.

విషయం అర్థమైన మూర్తి పగలబడి నవ్వాడు.

పరమేశానికి నవ్వాలో ఏడవాలో తెలియడం లేదు. అంతవరకు అక్కడే ఉండి వింటున్న పంకజం కూడా సిగ్గుతో పరమేశానికి సారీ చెప్పింది.

సినిమా టిక్కెట్లు తెచ్చిన ఇక్కట్లు తలుచుకుంటూ ఇద్దరూ మునిమునిగా నవ్వుకొన్నారు.

మూర్తి మాత్రం ఇదే అవకాశంగా "చూడండీ, ఒకరి పట్ల ఒకరికి నమ్మకం ఉంటే వారి కాపురాల్లో ఎన్నటికి అపార్థాలకి తావుండదు" అంటూ చిన్న సలహాని పారేశాడు.


**-సోమవరఘుల నాగేంద్ర ప్రసాద్ (వారణాసి)**

# ట్రాన్స్‌ఫర్

హెడ్ ఆఫీసుకి పంపించవలసిన అకౌంట్స్ స్టేట్‌మెంట్స్ పూర్తయ్యేసరికి గడియారం రాత్రి పదకొండు గంటలు కొట్టేసింది. ఇక ఇంటికి వెళ్దామని లేచేసరికి, మేనేజరు రూములో లైట్లు వెలుగుతూ ఉండడం కనిపించింది. ఈ సమయం వరకూ మేనేజరుగారు ఆఫీసులో ఉండడం ఆశ్చర్యం కలిగించింది. సరే, ఇదీ ఒకందుకు మంచిదే. ఈ రోజే స్టేట్‌మెంట్స్‌పై మేనేజరుగారి సంతకం కూడా చేయించేస్తే, రేపు ఉదయాన్నే వాటిని పంపేయవచ్చు.

స్టేట్‌మెంట్స్ పట్టుకొని, మేనేజరు గారి రూములోనికి వెళ్లాను. కంప్యూటరు ముందు కూర్చొని ఇంటర్నెట్‌లో ఏదో చూసుకుంటున్న మేనేజరుగారు ఏంటన్నట్లు నా వైపు చూశారు. తెచ్చిన స్టేట్‌మెంట్స్ అతని ముందుంచాను. వాటిని పరిశీలించిన మేనేజరుగారి ముఖంపై చిరునవ్వు విరిసింది. "వెరీగుడ్, వీటిని పంపించడానికి ఇంకా పదిహేను రోజుల సమయం ఉన్నా కష్టపడి ఇంత ముందుగా పంపించేస్తున్నావంటే, నీ సిన్సియారిటీ తెలుస్తోంది" మెచ్చుకున్నారు.

వాటిపై సంతకం చేసి నా చేతికందిస్తూ "చూడు మూర్తీ, ఆ గోపాలం సీటుపై ఫైల్సన్నీ పేరుకుపో



యాయి. ఎలాగూ నీ పని ముందుగానే పూర్తిచేసేశావు కాబట్టి వాటి సంగతి కూడా చూడు" అన్నారు.

"అలాగే సార్! వాటన్నింటిని కూడా వీలయినంత త్వరలో క్లియర్ చేసేస్తాను" అన్నాను.

నా పని వేగమే పూర్తి చేశానన్న మేనేజర్ గారి మెప్పుకోలు కన్నా, ఎక్కువగా నాకు ఆనందం కలిగించిన విషయం నన్ను గోపాలం ఫైల్సు చూడమని పురమాయించడం.

నా పక్కసీట్లో పనిచేసే గోపాలం మా ఊరి వాడే. మా ఊరికి ట్రాన్స్‌ఫర్‌కై ఇద్దరం ప్రయత్నిస్తున్నాం. ట్రాన్స్‌ఫర్‌కి మేనేజర్ రికమండేషన్ తప్పని సరి. గోపాలం సీటు పని కూడా పూర్తిచేసి మేనేజరుగారి మెప్పు పొందాలని నేను ప్రయత్నిస్తున్నదందుకే.

ఇంటికి చేరేసరికి రోజూలాగే అర్థరాత్రి పన్నెండు దాటింది. నాతో కలసి భోజనం చేద్దామని నిద్రకళ్లతో కాచుకున్న మా ఆవిడ, తలుపుతీస్తూనే చీవాట్లు దండకం అందుకుంది. "వచ్చేరా! సాయంత్రం ఐదయ్యేసరికి ఇంటికి వచ్చి, ఏ షికారుకో తీసుకెళ్తారని మా వాళ్లు మీకిచ్చి పెళ్లిచేశారు. నా ఖర్మ ఇలా కాలింది. పక్కింటి గోపాలం చూడండి. అతనిదీ మీలాంటి ఉద్యోగమే కదా! భార్యతో ఫస్టు షోకి వెళ్లి, వచ్చేటప్పుడు హోటల్లో భోజనం చేసి మరీ వచ్చారు. నా బతుక్కి అంతదృష్టం కూడాను."

మరో పది రోజుల్లో గోపాలం పెండింగ్ ఉంచేసిన ఫైళ్లన్నింటినీ క్లియర్ చేసేసి, మేనేజర్ గారి సంతకం కోసం పంపించేశాను. తన సీట్లో రిలేక్స్‌డ్‌గా కూర్చొని, ఫిల్మ్‌మేగజైన్ చదువుకుంటున్న గోపాలంతో "చూడు గోపాలం, మనం తీసుకుంటున్న జీతానికి తగ్గ పని చేయాలి. నా సిన్సియారిటీని మేనేజర్‌గారు ఎంతగా మెచ్చుకుంటున్నారో తెలుసా?" హితవు చెప్పబోయాను.

గోపాలం నా వైపు నవ్వుతూ చూశాడు. "నీకింకా లోకజ్ఞానం రాలేదయ్యా మూర్తీ! ఎంతసేపూ ఆఫీసరూ, ఆదర్శాలూ అంటూ ఉండడం కాదు, కొంచెం నీ ఇల్లూ, సంసారం గూర్చి కూడా ఆలోచించు" అంటూ తిరిగి నాకే చెప్పడం మొదలుపెట్టాడు.

మరో నెలలో ఎంతగానో ఎదురుచూస్తున్న ట్రాన్స్‌ఫర్స్ లిస్ట్ హెడ్ ఆఫీసు నుంచి వచ్చేసింది. తప్పక ట్రాన్స్‌ఫర్ అవుతుందని ఆశించిన నాకు, అనుకోని విధంగా ఆశాభంగం ఎదురయ్యింది. నా బదులు, గోపాలానికి మా ఊరికి ట్రాన్స్‌ఫర్ అయింది. వెంటనే మేనేజరుగారి రూములోనికి వెళ్లాను. మేనేజరుగారు నన్ను చూస్తూనే "ఇప్పుడే ట్రాన్స్‌ఫర్స్ లిస్టు చూసానయ్యా మూర్తీ, హెడ్ ఆఫీసుకి నేను నీ గురించి ఎంత చెప్పినా వాళ్లు వినలేదు. వయస్సులో గోపాలం నీ కన్నా ఆర్నెల్లు పెద్ద. అందుకే అతనికి ట్రాన్స్‌ఫర్ అయింది. గవర్నమెంటు రూల్స్ అలా ఉన్నాయి. వచ్చే సంవత్సరం తప్పక నీకు ట్రాన్స్‌ఫర్ చేయించి తీరుతాను. నాది హామీ సరేనా!" అంటూ ఓదార్చేరు.

నీరసంగా నా సీటు వద్దకు వ్చాను. ఇందాక మేనేజరు గారి రూములోనే వదిలేసిన నా ఫైలు గుర్తుకొచ్చి, దాని కోసం మళ్లీ మేనేజర్ ఛాంబర్ వైపు వెళ్లాను.

వెళ్లేసరికి రూములోకి అసిస్టెంట్ మేనేజర్‌గారు వెళ్తుండడం చూసి, వారిరువురు మాట్లాడుకుంటున్నప్పుడు లోనికి వెళ్లడం మర్యాద కాదని, రూము బైట నున్న స్టూల్‌పై కూర్చున్నా.

లోపలి మాటలు కొద్దిగా వినబడుతున్నాయి. మధ్యలో నా ప్రస్థావన రావడంతో ఆసక్తిగా విన్నాను.

మేనేజరుగారు చెబుతున్నారు. "ఈ ఏడాది గోపాలానికి ట్రాన్స్‌ఫర్ చేయించేశాను. ఎలాగూ పనిచేయడు కాబట్టి ఉన్నా వెళ్లిపోయినా పెద్ద తేడా లేదు. మూర్తిని ఇక్కడే ఉంచేశాను. మూర్తిని పంపించేస్తే పనికి బాగా ఇబ్బందయ్యేది. ట్రాన్స్‌ఫర్ కాలేదని ఫీలవుతున్నాడనుకో. కానీ పనిచేసే వాడిని వదులుకుంటే ఎలా? నేను మరో రెండేళ్లిక్కడే ఉండాలి. కనుక ఈ రెండేళ్లూ మూర్తిని ఇక్కడే ఎలాగోలా ఉంచాలి. ఆ గోపాలానికి బదులు ఇంకెవ్వర్నీ ఆ సీటుకై ఇవ్వటం లేదట. ఆ సీటు చూడడానికి కూడా మూర్తినే మెల్లగా ఒప్పించాలి."

ఆ మాటలు వింటూ నివ్వెరపోయి ఉండిపోయిన నేను ఆనందంగా స్టాఫ్ అందరికీ స్వీట్లు పంచుతూ గోపాలం వచ్చి తట్టి లేపడంతో ఈ లోకంలోకి వచ్చా.

**-బిహెచ్.వి. నాగేశ్వరరావు (రాయగడ)**